# ఆంధ్రప్రదేశ్ శాసన సభ కార్యకలాపాలు

# LEGISLATIVE ASSEMBLY DEBATES

## అధికార నివేదిక

## OFFICIAL REPORT

గురువారం, డిసెంబరు 12, 2013

13 వ శా. స. XII – III సమావేశం, వాల్యూం -- V నంబరు --
1

శక సంవత్సరం – 1935, అగ్రహాయణ్ – 21

**THURSDAY, THE 12th DECEMBER, 2013**

**13 L.A. XII - III SESSION, VOL— V No. - 1**

**21 - Agrahayan, 1935 - S.E.**

#

శాసన సభ సచివాలయం

పబ్లిక్ గార్డెన్స్

హైదరాబాదు – 500 004.

**LEGISLATURE SECRETARIAT**
**PUBLIC GARDENS**
**HYDERABAD**
**500 004.**

# ఆంధ్రప్రదేశ్ శాసన సభ

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| సభాపతి | : | శ్రీ నాదెండ్ల మనోహర్ |
| ఉప సభాపతి | : | శ్రీ మల్లు భట్టి విక్రమార్క |
| అధ్యక్షుల పేర్ల పట్టిక | : | శ్రీ పి. కిష్టా రెడ్డి<br>శ్రీ జి. వెంకట శేషు<br>శ్రీమతి ఎ. ఉమా మాధవ రెడ్డి<br>శ్రీమతి వంగా గీతా విశ్వనాథ్ |
| కార్యదర్శి | : | శ్రీ ఎస్. రాజ సదారామ్ |
| ఉప కార్యదర్శులు | : | శ్రీ కె. సత్యనారాయణ రావు<br>శ్రీ పి. బాలకృష్ణమాచార్యులు<br>శ్రీ వి. నరసింహాచార్యులు<br>శ్రీమతి టి. సుశీల<br>శ్రీ ఎం. విజయ రాజు<br>శ్రీ వి. రమేష్ కుమార్ |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ పి. వి. సుబ్బారెడ్డి<br>శ్రీ టి. బి. జయచందర్<br>శ్రీ ఎస్. దుర్గా ప్రసాద్<br>శ్రీ కె. రాజ్ కుమార్<br>శ్రీ సిహెచ్. ఉపేందర్ రెడ్డి<br>శ్రీమతి ఎ. చంద్రభాగ<br>శ్రీమతి వి.ఎన్. ప్రసన్న కుమారి<br>శ్రీమతి ఆర్. వనితా రాణి<br>శ్రీ పి. నరసింహ<br>శ్రీ బి. కమలాకర్<br>డా.( శ్రీమతి) వై. కామేశ్వరి<br>శ్రీ ఇ. సంజీవ రావు<br>శ్రీ కె. వెంటేశ్వర రావు<br>శ్రీ డి. జగన్ మోహన్ రావు<br>శ్రీ బి. ప్రభాకర రావు |

శ్రీమతి కె. భారతి

శ్రీమతి డి. విజయ కుమారి

చీఫ్ రిపోర్టర్ : శ్రీ పి. శ్రీనివాస్

-------------

# ఆంధ్రప్రదేశ్ శాసన సభ చర్చలు

## అధికార నివేదిక

## ( 13వ శాసన సభ )

## (12వ సమావేశపు మూడవ సమావేశము : మొదటి రోజు)

## ... .... గురువారము, డిసెంబరు 12, 2013

## సభ ఉ. గం.10.00 లకు ప్రారంభమైనది

## (గౌ. సభాపతి అధ్యక్ష స్థానములో ఉన్నారు)

----------

## విషయ సూచిక

1. సభా కార్యక్రమము
2. సంతాప ప్రతిపాదనలు
    1. దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు శ్రీ నెల్సన్ మండేలా గారి మృతిపట్ల సంతాపం
    2. ఆంధ్రప్రదేశ్ శాసన సభ మాజీ సభ్యుల మృతి పట్ల సంతాపం

-------

# ఆంధ్ర ప్రదేశ్ శాసన సభ

గురువారం, డిసెంబర్ 12, 2013

(సభ ఉదయం 10.00 గంటలకు ప్రారంభమయింది. గౌరవ సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు.)

## సభా కార్యక్రమము

( సభ ప్రారంభం కాగానే ప్రధాన ప్రతిపక్షమైన తెలుగు దేశం పార్టీ మరియు యువజన, శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ (YSRCP)కి చెందిన కొంత మంది సభ్యులు సభలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభాపతి స్థానం వద్దకు చేరుకున్నారు. సభాపతి స్థానం వద్దకు చేరుకున్న అనంతరం తెలుగు దేశం పార్టీ సభ్యులు సభా పతి స్థానం వద్ద నిలబడి "ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచాలి" "జై సమైక్యాంధ్ర, జైజై సమైక్యాంధ్ర అంటూ గట్టిగా నినాదాలు చేస్తూ సభకు అంతరాయం కలిగించ సాగారు. వైఎస్ఆర్‌సిపి సభ్యులు కూడా " సమైక్యాంధ్ర ప్రదేశ్ కోసం ఈ అసెంబ్లీలో తీర్మానం చేయాలి" " జై సమైక్యాంధ్ర" జై జై సమైక్యాంధ్ర" అంటూ పలుమార్లు గట్టిగా నినాదాలు చేస్తూ సభకు అంతరాయం కలిగించసాగారు.)

మిస్టర్ స్పీకర్ః దయచేసి మీ స్థానాలలో మీరు కూర్చోండి........

(సభాపతి స్థానం దగ్గరున్న తెలుగు దేశం మరియు వైఎస్ఆర్‌సిపి సభ్యులు తమ తమ నినాదాలు కొనసాగిస్తూ సభకు అంతరాయం కలిగించసాగారు. )

మనం ఈ రోజు సభలో కొన్ని సంతాప తీర్మానాలను ఆమోదించవలసి వుంది. సభ్యులు దయచేసి మీ మీ స్థానాలకు వెళ్లి కూర్చోండి...... దయచేసి సహకరించండి......

(సభాపతి స్థానం దగ్గరున్న తెలుగు దేశం మరియు వైఎస్ఆర్‌సిపి సభ్యులు తమ నినాదాలు కొనసాగిస్తూ సభకు అంతరాయం కలిగించసాగారు.)

సంతాప తీర్మానాలండీ....... ఇటీవల మరణించిన నెల్సన్ మండేలా గారికి మరియు ఇంతకు ముందు మరణించిన మన మాజీ శాసనసభ్యుల మృతికి సంతాప సూచకంగా

తీర్మానాలను ఈ సభలో మనం ప్రతిపాదించవలసి వుంది. దయచేసి మీరు మీ స్థానాలకు వెళ్లి వారి మృతికి సంతాపం తెలిపే తీర్మానాలను ఆమోదించడంలో ఈ సభకు సహకరించండి. ఫ్లోర్ లీడర్లు దయచేసి తమ తమ సభ్యులను వాళ్ల స్థానాలలో వెళ్లి కూర్చోమని చెప్పవలసిందిగా కోరుతున్నాను.

( సభాపతి విజ్ఞప్తి మేరకు వైఎస్ఆర్‌సిపి సభ్యులు తమ తమ స్థానాలకు వెళ్లిపోయారు. అయితే సభాపతి స్థానం దగ్గరున్న తెలుగు దేశం పార్టీ సభ్యులు తమ నినాదాలు కొద్దిసేపు కొనసాగించిన అనంతరం వాళ్లు కూడా తమ స్థానాల వద్దకు వెళ్లిపోయారు.)

## సంతాప ప్రతిపాదనలు

### 1. దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు శ్రీ నెల్సన్ మండేలా గారి మృతిపట్ల సంతాపం

శ్రీ ఎన్.కిరణ్ కుమార్ రెడ్డి (ముఖ్యమంత్రి)ః జాతి వివక్షతకు వ్యతిరేకంగా, మానవ హక్కుల సాధనకు ఎనలేని కృషి చేసిన దక్షిణ ఆఫ్రికా మాజీ అధ్యక్షులు శ్రీ నెల్సన్ మండేలా గారి మృతికి ఈ సభ తీవ్రంగా దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేస్తున్నది. ఆ దేశ ప్రజలకు, వారి కుటుంబ సభ్యులకు ఈ సభ ప్రగాఢ సానుభూతిని ప్రకటిస్తున్నది.

శ్రీ నెల్సన్ మండేలా గారు 1918 జూలై 18న జన్మించారు. 2013 డిసెంబర్ 5న కన్ను మూశారు. ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, వారి హక్కుల కోసం పోరాడిన మహా యోధులు. దాదాపు 30 ఏళ్ల పాటు జైలు జీవితాన్ని గడిపారు. జాతి వివక్షత, పేదరిక నిర్మూలన, అందరూ సమానంగా జీవించడం కోసం ఆయన తన జీవితాన్ని త్యాగం చేశారు. మహాత్మా గాంధి స్ఫూర్తితో పౌరుల హక్కుల కోసం నిరంతరం పోరాటం జరిపిన మహనీయులు. మానవ జాతి చరిత్రలో ఆయన ఒక మహా శిఖరం. 1994లో ప్రజలచే ప్రజాస్వామ్యబద్ధంగా దక్షిణ ఆఫ్రికాకు మొట్టమొదటి అధ్యక్షులుగా ఎన్నుకోబడిన గొప్ప వ్యక్తి. ప్రపంచ ప్రజల ఆదరణతో ఆయనకు వచ్చిన అవార్డ్స్‌కు, రివార్డ్స్‌కు లెక్కలేదు. వాటిలో కొన్ని........ యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ ఆయన పుట్టిన రోజు అయిన జూలై 18ని మండేలా డే గా ప్రకటించింది. 1993లో నోబెల్ పీస్ ప్రైజ్, 1990లో భారత రత్న, అమెరికన్ ప్రెసెడెన్సియల్

మెడల్ ఆఫ్ ఫ్రీడమ్‌తో పాటు దాదాపు 50 ఇంటర్నేషనల్ యూనివర్సిటీలు ఆనరరీ డిగ్రీలను ప్రదానం చేశాయి.

ఉ.10.10

ప్రపంచంలో స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోరుకునే ప్రతి పౌరునికి ఆ మహానేత మరణం తీరని లోటు. నా తరపున, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల తరపున ఆ మహనీయునికి నివాళులు అర్పిస్తున్నాను.

శ్రీ ఎన్. చంద్రబాబు నాయుడు(కుప్పం)ః అధ్యక్షా, స్వంత గడ్డపై కనీసం ఓటు హక్కు కూడా లేకుండా బాధ పడుతూ నల్ల జాతీయుల తరపున మండేలా అసమాన పోరాటం చేశారు. తన జీవిత కాలంలో ఇది ఒక ఉదాహరణ. ఆయన మూడవ వంతు జీవిత సమయం జైలులోనే గడిపారు. ఆ విధంగా కటకటాల వెనుక దుర్భర జీవితాన్ని అనుభవిస్తూ మహాత్ముని బాటలో అహింసను, క్షమా గుణాన్ని వదలి పెట్టకుండా ముందుకు వెళ్లిన మహానుభావుడు. నల్ల జాతి సూరీడుగా శ్రమకు అర్థం తెలిపిన వ్యక్తి నెల్సన్ మండేలా. దక్షిణాఫ్రికాలో ఆయన త్యాగాల ఫలితంగా జాతి వివక్షత నుండి పూర్తిగా విముక్తి లభించింది. మానవ జాతి చరిత్రలో మండేలా ఒక మహా శిఖరం . అన్యాయం, అసమానతలకు వ్యతిరేకంగా పోరాడారు. సత్యాగ్రహం పట్ల మండేలాకు అచంచలమైన విశ్వాసం . సత్యాగ్రహాన్ని ఒక ఆయుధంగా ఉపయోగించుకొని మహాత్మునికి ఏకలవ్య శిష్యుడిగా పోరాటం చేశారు. ఆయన యొక్క పోరాటం మహాత్ముని పోరాటాన్ని స్ఫూర్తిని గుర్తు చేస్తుంది. ఆయన మాట్లాడేటప్పుడు నా ఆలోచన సరళిపై మహాత్మాగాంధీ ప్రభావం ఎక్కువగా ఉందని చెప్పడం మనందరికీ గర్వ కారణం . ఈ దశాబ్దంలో ప్రపంచాన్ని ప్రభావితం చేసే వ్యక్తి ఆయన. అత్యంత కఠోరమైన శిక్ష, అణచి వేత, విచారణల మధ్య అహింసాయుత పోరాటం చేస్తూ ఎంతో హుందాగా గడిపారు.

1948లో ఎఎన్‌సి యూత్ లీగ్‌లో ప్రముఖ నేతగా ఎదిగారు. 1945లో జాతి వివక్షత క్రూరంగా చేస్తున్న సమయంలో నేషనల్ పార్టీ అధికారంలోకి రావడం జరిగింది. ఆ సమయంలో విభజించు, పాలించు సూత్రంతో అన్ని అకృత్యాలకు పాల్పడింది. ఆ

సమయంలో మహాత్మాగాంధీ స్ఫూర్తితో ప్రభుత్వానికి సహాయ నిరాకరణ చేయాలని మండేలా ఉద్యమించారు.

1955లో జోహన్స్‌బర్గ్‌లో ఒక మహాసభలో ఫ్రీడమ్ చార్టర్ ఆమోదించారు. దానికి ఆగ్రహించిన ప్రభుత్వం 156 మందిపై కుట్ర కేసు పెట్టింది. 1964 ఏప్రిల్ 20వ తేదిన ప్రిటోరియా కోర్టు బోనులో రివోనియా కేసు విచారణ సందర్భంగా మొదటి ముద్దాయి మండేలా. ఎందుకంటే ఆయన ఉపన్యాసం నాలుగు గంటలు సింహగర్జనలా చేశారు. ఆ ఉపన్యాసం ప్రపంచవ్యాప్తంగా సంచలనాత్మకమైంది.

ఆయన మొదటి ప్రెసిడెంట్‌గా ఎంపిక కావడం జరిగింది. అప్పుడు కూడా ఆయన చాలా హుందాగా ముందుకు వెళ్లాడు. ఆయన జీవితమంతా ఆఫ్రికన్ల స్థితిగతులను మెరుగుపరచడానికి పోరాటం చేశాడు. ముఖ్యంగా ఆఫ్రికన్లకు సరైన పని, తగిన వేతనాలు, స్వంత భూమి, ఇల్లు లాంటి కనీస సదుపాయాలు ఉండాలని ఆయన పోరాటం జరిగింది. ఆయన 50 సంవత్సరాలు రాజీ లేని పోరాటం చేశారు. ఆ పోరాట ఫలితమే ఆఫ్రికన్లకు విముక్తి కలిగించింది. జాతి వివక్షతపై చాలా దారుణంగా ఉండే దాని నుండి విముక్తి లభించింది. ఈ రోజు నెల్సన్ మండేలా మృతి జాతి ఒక యుగపురుషుడిని కోల్పోయింది. ఆయన సంతాపసభకు ప్రపంచంలోని నేతలందరూ వచ్చి సంతాపం తెలిపారంటే ఎంత గర్వించదగ్గ విషయమో అర్థమవుతుంది. సమాజంలో చాలా మంది పుడతారు, కాని కొంతమందే యుగపురుషులుగా మిగిలిపోతారు. అటువంటి యుగ పురుషులలో మండేలా ఒకరు. ఆయనకు మన దేశం తరపున కూడా భారతరత్న బిరుదు ఇచ్చామంటే మనం కూడా గర్వపడవలసిన అవసరం ఉంది. ఒక ఉన్నతమైన వ్యక్తికి చరిత్రలో శాశ్వతంగా ఉండే వ్యక్తికి భారతరత్న ఇవ్వడం జరిగింది. ఆయన చనిపోవడాన్ని ఎవరూ జీర్ణించుకోలేక పోతున్నారు. ప్రపంచంలో ఆయన వేసిన ముద్ర, చూపించిన ఆశయం శాశ్వతంగా ఉంటుంది. అహింసా విధానంతో ఏదైనా సాధించవచ్చునని నిరూపించిన వ్యక్తి నెల్సన్ మండేలా. అటువంటి వ్యక్తికి ఈ అసెంబ్లీలో నివాళులు అర్పించడం గర్వ కారణంగా నేను భావిస్తున్నాను. అదే సమయంలో తెలుగుదేశం పార్టీ తరపున, మన రాష్ట్రం తరపున మండేలా కుటుంబ సభ్యులకు, ఆ దేశ

ప్రజలకు ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తూ, వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కె. తారక రామారావు(సిరిసిల్ల)ః అధ్యక్షా, ప్రజా కవి కాళోజి నారాయణరావుగారు ఒక కవిత వ్రాశారు. పుట్టుక నీది, చావునీది కాని బ్రతుకంతా దేశానిది'' అని వ్రాశారు. ప్రపంచంలో ఎవరికి ఆ కవిత వర్తించినా వర్తించకపోయినా నెల్సన్ మండేలాకు మాత్రం అది వర్తిస్తుంది. నెల్సన్ మండేలాకు మాత్రం పుట్టుక, చావు తనదైనప్పటికీ బ్రతుకంతా దేశం కోసం అంకితం చేసిన మహానుభావుడుగా ప్రపంచ చరిత్రలో ఆయన పేరు శాశ్వతంగా నిలచిపోతుంది.

1918లో జన్మించిన మండేలాగారు 1939లో Fort Hare University లో విద్యార్థి నాయకుడిగా ఉద్యమాల ప్రస్తానాన్ని ప్రారంభించారు. 1940లో కాలేజీ నుండి బహిష్కరిస్తే భయపడకుండా ప్రజల పక్షాన నిలిచిన యోధుడు. నల్ల జాతీయుల ప్రక్కన, ఆఫ్రికన్ ప్రజల పక్షాన ఒక న్యాయవాదిగా, ఒక సామాజిక ఉద్యమకారుడిగా, గెరిల్లా యోధుడిగా ఆయన జీవితం మొత్తం పోరాటాలతో కొనసాగింది. పోరాటాన్ని పర్యాయపదంగా మార్చుకున్న ఘనత నెల్సన్ మండేలాకు దక్కుతుంది.

భారతదేశంలో అత్యంత పెద్ద నేరం చేస్తే జీవిత ఖైదు 13 సంవత్సరాలు కఠిన శిక్షగా మనం భావిస్తాము. కాని దానికి రెట్టింపు శిక్ష 27-28 సంవత్సరాలు జైలు జీవితం ఆయన గడిపాడు. అంటే మన దేశంలో విధించే జీవిత ఖైదుకంటే రెట్టింపు సంవత్సరాలు ఆయన జైలులో గడిపినప్పటికీ ఆయన గుండె ధైర్యం, గుండె దిటవు తన జైలు జీవితాన్ని దెబ్బ తీయలేకపోయింది. ప్రపంచ వ్యాప్తంగా ఈ రోజు అణగారిన వర్గాలకు, అణగారిన జాతులకు నెల్సన్ మండేలా జీవితం ఒక ఆదర్శం . ఆయన జీవితంలో సింహ భాగం జైలులోనే గడిపారు. ఒక సందర్భంలో ఆయన జైలు నుండి బయటకు వచ్చి సంప్రదింపులకు రండి అంటే ఒకటే మాట చెప్పారు. " I have cherished the ideal of a democratic and free society in which all persons live together in harmony and with equal opportunities. It is an ideal which I hope to live for and to achieve but, if need be, it is an ideal for which I am prepared to die……" అంటే మరణానికి సైతం

వెరవకుండా సాటి మనుష్యులను మనుష్యులే అణచి వేసే అమానవీయమైన సమాజం నుండి అందరికీ విముక్తి రావాలని పోరాటాలు, నిరసనలతో ముందుకు వెళ్లారు. ఏ దక్షిణాఫ్రికాలో జరిగిన సంఘటన ఒక మోహన్ దాస్ కరమ్‌చంద్ గాంధీని మహాత్ముడిగా చేసి, భారతదేశం వచ్చే విధంగా ఉసికొల్పిందో అదే దక్షిణాఫ్రికాలో నెల్సన్ మండేలా అందించిన స్ఫూర్తి తరతరాలకు మరచిపోలేనిది. "Difficulties break some men, but make others". అటువంటి కష్టాలు వచ్చినప్పుడు కొంతమంది పూర్తిగా క్రుంగిపోయి తట్టుకోలేని పరిస్థితుల్లో ఉంటారు. కాని నెల్సన్ మండేలా ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారు. ఆయన ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలలో ఆప్తులను, అభిమానులను కోకొల్లలుగా సంపాదించుకున్నారు. ఆయన నిజంగా చరితార్థుడు, ఒక కారణజన్ముడు. ఆయన ప్రతికూల పరిస్థితులలో కూడా మొక్కవోని ధైర్యంతో పోరాటం చేశాడు. తన పోరాటం బలవంతులతో అని తెలిసి కూడా మండేలాగారు ఈ పోరాటంలో కష్టాలు, కన్నీళ్లుంటాయని తెలిసి కూడా పోరాటమే తన జీవితానికి ఒక పర్యాయపదంగా మార్చుకున్నారు. ఆయనది ఒక అసాధారణమైన వ్యక్తిత్వం . ఆది నుండి అంతం వరకు ప్రపంచవ్యాప్తంగా ఎన్నో కోట్ల మంది జీవితాలను ప్రభావితం చేయడం, అపనమ్మకంతో కూడిన సమాజంలో ఒక నమ్మకాన్ని కలిగించడం, తాను కొవ్వొత్తిలాగా కరిగి పోతూ ఇతరులకు వెలుగునివ్వడం సామాన్యమైన విషయం కాదు. శ్రీ శ్రీ చెప్పిన విధంగా ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వ కారణం, నరజాతి చరిత్ర సమస్తం పర పీడన పరాయణత్వం లాగా ఉంది.

ఉ.10.20

ప్రపంచంలో దోపిడీ ఉన్నంతవరకూ పోరాటాలు కొనసాగుతూనే ఉంటాయి. పోరాట యోధులు తమ జీవితాన్ని పణంగా పెట్టి పోరాడుతూనే ఉంటారు. అలాంటి యోధులు తరతరాలను ప్రభావితం చేస్తారు. దక్షిణాఫ్రికాలో అన్ని వనరులు ఉండి కూడా వలసపాలకుల ఆధిపత్యంలో, శ్వేత జాతీయుల అహంకారపూరితమైన వర్ణవివక్షపైనా అసమానమైన పోరాటం చేసిన ధీరోదాత్తుడు. దక్షిణాఫ్రికాలో ప్రజాస్వామ్య స్థాపన కోసం జీవితంలో ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా పరవాలేదని చెరసాలను కూడా ఉద్యమ ఖిల్లాగా మార్చారు. కనీస సౌకర్యాల కోసం, చదువుకునే హక్కు కోసం పోరాడారు. అర్ధ శతాబ్దానికి పైగా అలుపెరగని పోరాటం కొనసాగించిన మండేలా విముక్తి పొందిన తర్వాత కూడా ఉన్నత రాజకీయ

ప్రమాణాలు పోటించారు. ఒక పర్యాయం అధ్యక్ష పదవి తర్వాత, తన సహచరులకు బాధ్యతలు అప్పగించారు. దక్షిణాఫ్రికాలో ఆశించిన పురోగతి రాలేదని, దారిద్ర్యం అంతరించిపోలేదని, పెత్తనం ఇంకా తెల్లవారి చేతిలోనే ఉందని పోరాట ఫలాలు ఇంకా అణగారిన వర్గాలకు అందలేనందున ఆయన నాయకత్వంలో సమాన అవకాశాలు కల్పించడం జరిగింది. ఆయన మరణంతో పోరాటాల ప్రపంచంలో ఒక శకం ముగిసింది. భౌతికంగా ఆయన మన మధ్యన లేకపోయినా, ప్రపంచ నలుమూలల్లో స్వేచ్ఛ కోసం, హక్కుల కోసం, సమానత్వం కోసం జరిగే ఏ పోరాటంలోనైనా ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలి. మానవ హక్కుల కోసం, స్వేచ్ఛ, సమానత్వం కోసం, తన జాతి ఆత్మగౌరవంతో కూడిన బతుకు కోసం జీవించి, పోరాడి, అమరుడైన ఆయన ఒక ధృవతార. నీ హక్కుల కోసం నువ్వు పోరాడు, నీ స్వేచ్ఛ కోసం పోరాడు, ఇతరుల హక్కులపై ఆధిపత్యం కోసం పోరాడకూడదు అని ఆయన చెప్పిన మాటను గుర్తు చేస్తూ ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ , వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీమతి వై.ఎస్. విజయలక్ష్మి (పులివెందుల): అధ్యక్షా, నెల్సన్ మండేలా తన 95 ఏళ్ల వయసులో భౌతికంగా మనందరికీ దూరం అయ్యారు. ఎక్కడో దక్షిణాఫ్రికాలో మండేలా అనే మనిషి చనిపోతే ఇక్కడున్న మనం ఎందుకు బాధపడుతున్నాం అంటే, ఆ మనిషి జీవితమే ఓ సందేశంగా బతికాడు. మహాత్మా గాంధీగారిని ఆయన జీవించి ఉండగా, మీరు ఇచ్చే సందేశం ఏమిటి అని అడిగినప్పుడు - నా జీవితమే నేనిచ్చే సందేశం అని సమాధానం చెప్పారట. అంత గొప్పగా జీవించారు మండేలా. అందుకే ఈ భూమి మీద ఉన్న మానవాళి అంతా మండేలాను ప్రేమించారు, అభిమానించారు, ఆదరించారు, తమ ఆత్మీయుడు అనుకున్నారు. నిజానికి ఈ దేశ ప్రజల్లో ఒక్క శాతం కూడా మండేలాను ఏనాడూ ప్రత్యక్షంగా చూడలేదు. అయినా ఆయన మనలో మనిషి . ఒక గాంధీ, ఒక మార్టిన్ లాధర్ కింగ్ – జూనియర్, ఒక నెల్సన్ మండేలా .. వీరంతా మహా మనుషులు. దైవంతో నేరుగా సంభాషించగలిగినంత మహామనుషులు. మానవాళితో తమ చేతల ద్వారా సంభాషించిన మనుషులు. అందుకే వారికి ఎల్లలు లేవు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనేవి ఫ్రెంచి విప్లవం ఈ ప్రపంచానికి ఇచ్చిన మూడు గొప్ప వరాలు. అలాగే గాంధీ, మార్టిన్ లూధర్‌కింగ్ జూనియర్, నెల్సన్ మండేలా అన్న

ముగ్గురు మనుషులు మానవ జాతికి దక్కిన వరాలు.  మండేలా పట్టుదల, ఓర్పు అహింసాయుత పోరాటం  అసమాన వ్యక్తిత్వం గాంధీజీని అణువు అణువు గుర్తు చేస్తుంది. మనుషుల మధ్య రంగు, కులం, మతం వర్గం లాంటి సంకుచితమైన సంకెళ్లను తెంపి, మనిషిని మనిషిగా నిలబెట్టడానికి మొత్తం జీవితాన్ని పణంగా పెట్టి, మూడు వంతుల జీవితాన్ని జైల్లో గడిపినప్పటికీ పగ, ప్రతీకారం లేకుండా తనను బాధించిన మనుషుల్ని కూడా అక్కున చేర్చుకుని క్షమాగుణంలో ఎవరెస్టు శిఖరంలా ఎదిగిన మనిషి మండేలా- అత్యంత పూజనీయుడు. ఆయన దక్షిణాఫ్రికాలో రూపు మాపింది తెల్లవారికి -నల్లవారికి మధ్య అంతరాలను మాత్రమే కాదు మొత్తంగా దేశ దేశాల్లో ఉన్న వర్ణ  వివక్షను తన పోరాటంతో అంతం చేశారు మండేలా.  అభివృద్ధిదాయక సామాజిక ఆర్థిక మార్పునకు కారణమైన మహనీయుడు.  ఒక గాంధీ, మార్టిన్ లూథర్ కింగ్, నెల్సన్ మండేలా వంటి మహామనుషులు దైవముతో నేరుగా సంభాషించిన మనుషులు. మహాత్మా గాంధీ గురించి శాస్త్రవేత ఐన్‌స్టీన్ ఒక మాట అన్నారు. “ అలాంటి మానవుడు రక్తమంసాలతో నిజంగానే మన మధ్య నడయాడాడు అంటే బహుశా తరువాతి తరాలు నమ్మటం కష్టం “ అన్నారు గాంధీజి. నెల్సన్ మండేలాకు ఇదే వర్తిస్తుంది. మానవ జాతి చరిత్ర ఉన్నంత కాలం, మనుషుల మధ్య అంతరాల అడ్డుగోడలు ఉన్నంత కాలం వాటిని కూలగొట్టేందుకు నిరంతరం స్పూర్తి ఇస్తూనే ఉంటారు ఆ మహానాయకులు అందుకే వారికి ఎల్లలు లేవు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వారు ప్రపంచానికి ఇచ్చిన గొప్ప వరాలు. అందుకే చివరిగా నా మాట ఏమిటంటే,  మండేలాకు మరణం లేదని తెలియజేస్తూ  వారి కుటుంబానికి ప్రగాడ సానుభూతి తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

جناب سید احمد پاشاہ قادری (Sri Syed Ahmed Pasha Quadri): جناب اسپیکر صاحب! نیلسن منڈیلا صاحب کی پیدائش 18.07.1918 کو ہوئی تھی۔ پیشہ کے اعتبار سے وہ ایک لایر تھے اور سماجی سرگرمیوں میں نمایاں حصہ لیا کرتے تھے۔ اس سلسلہ میں 1962ء میں ان کو عمر قید کی سزا ہوئی، اور 1990ء میں ان کی رہائی ہوئی۔ ان کی رہائی کے لئے ایک بین الاقوامی تحریک چلائی گئی تھی، اسی تحریک کی بنیاد پر ان کی رہائی عمل میں آئی۔ وہ ہمیشہ نسل پرستی اور عدم مساوات کے خلاف آواز اٹھاتے رہے۔ 1991ء سے وہ ساؤتھ افریقن کانگریس کے صدر رہے اور پھر بعد میں 1994ء سے 1999ء تک صدر جمہوریہ، ساؤتھ افریقہ منتخب ہوئے۔ ساؤتھ افریقہ میں یہ پہلی بار سیاہ فام لوگوں میں سے صدر منتخب کئے گئے۔ ان کو 250 سے زیادہ اوارڈس اور اعزازات ملے جن میں نوبل پیس پرائز کے علاوہ ہندوستان کا بھارت رتن بھی شامل ہے۔ وہ نہایت ہی ہر دلعزیز تھے، دنیا کے لوگوں میں کافی مقبول تھے اور ساؤتھ افریقہ میں سب کے چہیتے تھے۔ میں ان کے انتقال پر ان کے خاندان کے ساتھ ہمدردی کا اظہار کرتا ہوں اور کل ہند مجلس اتحاد المسلمین کی جانب سے تعزیت پیش کرتا ہوں۔ شکریہ۔

శ్రీ గుండా మల్లేశ్ (బెల్లంపల్లి): అధ్యక్షా, అణగారిన ప్రజల ఆశాజ్యోతి, దక్షిణాఫ్రిక శ్వేతజాతి దురహంకార పాలక ప్రభుత్వానికి వ్యతిరేకంగా దీర్ఘకాలంగా పోరాడిన యోధుడు నెల్సన్‌మండేలా సంతాప తీర్మానాన్ని మన సభలో ప్రవేశపెట్టడం జరిగింది. నెల్సన్ మండేలా 1918 సంవత్సరం జూలై 18వ తేదీన జన్మించారు. దక్షిణాఫ్రికా దేశంలో మానవ హక్కులు లేకుండా నల్లజాతి ప్రజలను అణగదొక్కి బానిసలుగా భావించి, వెట్టిచాకిరి, కట్టుబానిస విధానం కొనసాగుతున్న నేపథ్యంలో 20 ఏళ్ల వయసులో నెల్సన్ మండేలా ఆ శ్వేత జాతి దురంహంకార పద్ధతులను భరించలేనటువంటి పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆయన చదువుకుంటున్న రోజులలో మిగిలిన విద్యార్థులతో కలసి ఈ అంశంపై చర్చించేవాడు. ఆయన ఇరవై సంవత్సరాల వయసులోనే దక్షిణాఫ్రికా నేషనల్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన శ్వేత జాతి దురహంకార ప్రభుత్వ పాలన విధానంపై పోరాటం సాగించారు. ఆయన ప్రధానంగా శాంతియుత పద్ధతులలో ఉద్యమాలు సాగించారు. అహింసకు వ్యతిరేకంగా ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లారు. నెల్సన్ మండేలా చిత్రహింసలకు గురి అయ్యారు. ఆయనపై అనేక కేసులు పెట్టారు. వాటి నుండి ఆయన తప్పుకున్నారు. ఇలాంటి పరిస్థితులలో శాంతియుత మార్గం వల్ల ప్రభుత్వం లొంగే పరిస్థితి లేదని, దక్షిణాఫ్రిక కమ్యూనిస్ట్ పార్టీ నాయకులతో కలసి చర్చించడం జరిగింది.

ఉ.10-30

దక్షిణాఫ్రికాలో తన సమకాలీకుడు, సహాధ్యాయి అయిన కమ్యూనిస్టు నాయకునితో కలిసి ఆయన ఉద్యమంలో పనిచేశారు. వారితో అన్ని విషయాలు చర్చించిన తరవాత దక్షిణాఫ్రికాలో మంత్రాలకు చింతకాయలు రాలవని, సాయుధ పోరాటం ద్వారానే దక్షిణాఫ్రికాలోని నల్ల జాతి ప్రజల హక్కులను కాపాడడం కోసం కమ్యూనిస్టు నాయకులతో కలిసి వారు ఉద్యమాన్ని సాగించారు. ఆ ఉద్యమం తరువాత తీవ్ర స్థాయికి వెళ్లింది. ఆ నేపథ్యంలో అక్కడ పెద్ద ఎత్తున హింస జరిగింది.

దక్షిణాఫ్రికాలో జరుగుతున్న సంఘటనలకు చలించిన జాతిపిత మహాత్మా గాంధీ గారు దక్షిణాఫ్రికాలో పర్యటించడం జరిగింది. దక్షణాఫ్రికాలో మహాత్మా గాంధీ గారు ఇచ్చిన సందేశంలో శాంతియుత పద్ధతిలోనే శ్వేత జాతి పరిపాలనను అంతమొందించాలని, దక్షిణాఫ్రికాకు స్వాతంత్ర్యం తీసుకురావాలని దక్షిణాఫ్రికా ప్రజలకు సంఘీభావాన్ని మహాత్మా గాంధీ గారు ప్రకటించడం జరిగింది. ఆ నేపథ్యంలో మహాత్మా గాంధీ గారి పట్ల నెల్సన్ మండేలా గారికి వినయ విధేయతలు మరింత పెరిగి మహాత్మా గాంధీ గారి పద్ధతిలోనే ఆయన తన కార్యక్రమాలు కొనసాగించడం జరిగింది. మహాత్మా గాంధీ విధానాలను నెల్సన్ మండేలా గారు ఆదర్శంగా తీసుకొన్నారు. ఆ రకంగా దక్షిణాఫ్రికాలో పోరాటం జరుగుతున్న రోజుల్లోనే ఆయనను అరెస్ట్ చేసి జైలులో నిర్బంధించారు. ఎన్నో సంవత్సరాలు ఆయన కారాగారంలో ఉన్నా ఆయన నిర్మించిన ఉద్యమాన్ని ఉద్యమకారులు తరవాత కూడా కొనసాగించారు. ఉద్యమ నాయకులను అరెస్ట్ చేస్తే ప్రజలు బెదిరిపోతారని, కార్యకర్తలు బెదిరిపోతారని అనుకుంటారు. కానీ అక్కడ అలా జరగలేదు. దక్షిణాఫ్రికాలో చాలా పెద్ద ఉద్యమం జరిగింది. బంతిని ఎంత గట్టిగా నేలకు కొడితే అంతే వేగంగా పైకి లేస్తుంది. అదే విధంగా నెల్సన్ మండేలాను నిర్బంధించినపుడు ఆ చర్యను సహించలేక దక్షిణాఫ్రికాలో వాడ వాడలా, గ్రామ గ్రామాన ప్రజల్లో తిరుగుబాటు వచ్చింది. అటువంటి పరిస్థితుల్లో దక్షిణాఫ్రికా ప్రభుత్వం 1990లో నెల్సన్ మండేలాను విడుదల చేయక తప్పలేదు.

జైలు నుంచి విడుదలైన తర్వాత ప్రజాస్వామ్య పద్ధతిలో నెల్సన్ మండేలా గారు దక్షిణాఫ్రికాకు అధ్యక్షులు కావడం ప్రపంచంలోని స్వేచ్ఛా జీవులందరికీ ఒక మంచి సందేశం వచ్చింది. నల్లజాతి ప్రజలు సాగించిన పోరాటాన్ని ప్రపంచమంతా స్ఫూర్తిగా తీసుకొనే పరిస్థితి

వచ్చింది. ఈ నేపథ్యంలో నెల్సన్ మండేలా జైలులో ఉన్నప్పుడు యావత్తు ప్రపంచం వారికి సంఘీభావం తెలిపింది. శ్వేత జాతి ప్రభుత్వం పైన వ్యతిరేక ఉద్యమాలు జరిగిన సంగతి తమరికి జ్ఞాపకం ఉండి ఉంటుంది. ఆయన అరెస్ట్ అయి జైలులో ఉన్న రోజుల్లో మన దేశంలోని ప్రజలు, ప్రజాతంత్ర వాదులు, దేశభక్తులు, వామపక్షాల నాయకులు నెల్సన్ మండేలాను విడుదల చేయమని కోరారు. భారతదేశంతోబాటు ప్రపంచ దేశాల నుంచి వారి విడుదలకు సంఘీభావంగా ఎన్నో ఉద్యమాలు జరిగాయి. నెల్సన్ మండేలా విడుదలైన తరవాత అప్పటికే 44 సంవత్సరాలుగా జైలులో నిర్బంధంలో ఉన్న కమ్యూనిస్టు నాయకులను విడుదల చేశారు. నెల్సన్ మండేలా గారు చరిత్ర పురుషుడు. వారికి భారత ప్రభుత్వం అత్యున్నత పురస్కారమైన భారతరత్నను ఇచ్చింది. నెల్సన్ మండేలా గారి మృతి పట్ల కమ్యూనిస్టు పార్టీ పక్షాన హృదయపూర్వక సంతాపాన్ని తెలియజేస్తున్నాను. ఆయన ఆశయాలను, విలువలను స్ఫూర్తిగా తీసుకొని తుది శ్వాసవరకు పనిచేస్తామని ఈ సందర్భంగా తెలియజేస్తూ ముగిస్తున్నాను.

శ్రీ ఎండల లక్ష్మీనారాయణ(నిజామబాద్-అర్బన్)ః అధ్యక్షా, ఈ భూమి పైన జన్మ అందరికీ దొరుకుతుంది. చరిత్ర చదవడం అందరికీ సాధ్యమవుతుంది. చరిత్రలో మైలురాయిగా నిలబడడం మాత్రం కొందరికే సాధ్యమవుతుంది. ఆ విధంగా చరిత్రలో చిర స్థాయిగా నిలిచి ధన్యమైన జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని పుణికిపుచ్చుకొన్న నెల్సన్ మండేలా గారు ఈ లోకాన్ని విడిచిన సందర్భంగా ప్రపంచమే నీరాజనాలు అర్పిస్తోంది. 1918 జూలై 18వ తేదీన తూర్పు ఆఫ్రికాలోని మారుమూల కుగ్రామంలో తంబూ తెగలో మండేలా గారు జన్మించారు. చిన్నతనంలో వారి నామధేయం రోలా ఇలా మండేలా అయినా విద్యార్థి దశలోనే వారు నెల్సన్ మండేలాగా తన జీవితాన్ని కొనసాగించడం జరిగింది. మండేలా గారు మన దేశంలో మహాత్మా గాంధీ గారిని స్ఫూర్తిగా తీసుకొని దక్షిణాఫ్రికాలో జాతి వివక్షకు వ్యతిరేకంగా పోరాటం సల్పి జాతి వివక్షకు వ్యతిరేకంగా జరిగిన సంగ్రామంలో ముందున్నారు. ఆ విధంగా మహాత్మా గాంధీ గారి స్ఫూర్తితో నెల్సన్ మండేలా గారు ఆజన్మాంతం జాతి వివక్షకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగించడం జరిగింది. దక్షిణాఫ్రికాలో ప్రత్యేకంగా తెచ్చిన చట్టం ద్వారా ఉన్నతోద్యోగాలు శ్వేత జాతీయులకు, చిన్న చితకా ఉద్యోగాలు స్థానికులకు కేటాయించడానికి వ్యతిరేకంగా పోరాటం ప్రారంభించి ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీని స్థాపించి జాతి వివక్షతకు

వ్యతిరేకంగా పోరాటం చేసిన మండేలా గారికి అప్పటి ప్రభుత్వం 1964లో జీవిత ఖైదు విధించి రావిన్ ఐల్యాండ్‌లో 18 సంవత్సరాలు, తరవాత మరో చోట వారిని నిర్బంధించినది.

పోరాట స్ఫూర్తికి అద్దం పడుతున్నట్లుగా 1968-69 మధ్య 12 నెలల కాలంలో తన తల్లి మృతి చెందినా, తన కుమారుడు ప్రమాదవశాత్తు మరణించినా చలించని వ్యక్తిత్వంతో పోరాటమే ఊపిరిగా బతికారు. నెల్సన్ మండేలా గారు జైలులో ఉన్నా కూడా వారి జీవిత భాగస్వామి ఉద్యమంలో కీలకపాత్ర నిర్వహించారు. వారు జైలులో ఉన్నా కూడా దక్షిణాఫ్రికా యువతకు పోరాట స్ఫూర్తిని ఇచ్చిన వ్యక్తి. వారు 1990లో జైలు నుంచి విడుదలైన తర్వాత ఒక మాట చెప్పారు. ''జీవితాంతం జాతి వివక్షకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వ్యక్తిగా ఇప్పటికి కూడా నేను ఒకవేళ క్రోధాన్ని గాని, విద్వేషాన్ని గాని మనసులో నింపుకుంటే నేను ఇంకా జైలు గోడల మధ్య ఉన్నట్లే'' అని అన్నారు. ఆ విధమైన గొప్ప వ్యక్తిత్వం కలిగిన వ్యక్తితో ఈ దేశానికి అపారమైన అనుబంధం ఉంది. వారు పోరాటం నిర్వహించి జైలు జీవితం గడిపి జైలు నుంచి విడుదలైన తర్వాత 1990లో మొట్టమొదటిసారిగా ప్రపంచంలో పర్యటించినది భారతదేశంలోనే అని తెలియజేస్తున్నాను.

భారతదేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్నను మన దేశం ఇచ్చి వారిని గౌరవించడం జరిగింది. 1993లో వారికి, క్లార్క్‌కు సంయుక్తంగా నోబెల్ శాంతి పురస్కారాన్ని అందించారు. వారు పరమపదించిన తరవాత వంద దేశాలకు చెందిన నాయకులు ముక్తకంఠంతో ఆ మహానీయునికి నివాళులర్పించడం చరిత్రలో నిలిచిపోయే ఘట్టమని తెలియజేస్తూ, అటువంటి మహనీయునికి నివాళులర్పిస్తూ భారతీయ జనతా పార్టీ పక్షాన శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను.

ఉ.10.40

శ్రీ జూలకంటి రంగారెడ్డి (మిర్యాలగూడ): అధ్యక్షా, నెల్సన్ మండేలా గారు మొత్తం ప్రపంచ ప్రజలకే ఒక ఆదర్శమైన గొప్ప నాయకుడు, విప్లవకారుడు, ఉక్కు మనిషి. ఆయన 22 సంవత్సరాల వయస్సులోనే న్యాయవాదిగా చదువు పూర్తి చేసుకుని దక్షిణాఫ్రికాలో కొన్ని శతాబ్దాల నుండి శ్వేతజాతి ప్రభుత్వం వ్యవహరిస్తున్న నిరంకుశమైన విధానం, వర్ణ వివక్షతకు

వ్యతిరేకంగా సాగిన పోరాటంలో దక్షిణాఫ్రికాలో ఉన్న కమ్యూనిస్టులతో కలిసి పెద్ద యెత్తున మిలిటెంట్ ఉద్యమాన్ని సాగించడం జరిగింది. ఆ ఉద్యమం సాగించడం వల్లనే 27 సంవత్సరాలపాటు ఆయనకు జైలు శిక్షను ఆ ప్రభుత్వం విధించి కేవలం ఒక్క జైల్లో మాత్రమే కాకుండా, మూడు, నాలుగు జైళ్లకు తిప్పింది. ఆయనకు శిక్ష విధించడంతో బాటు అనేక విధాలుగా హింసించారు, అవమానించారు. అయినా ఆయన తన పోరాటాన్ని ఏ మాత్రం వదిలి పెట్టలేదు. 1985వ సంవత్సరంలో "మీరు హింసను వీడితే, పోరాటాల్లో పాల్గొనకుండా ఉంటే మిమ్మల్ని విడుదల చేస్తాము" అని ప్రభుత్వం చెప్పినా ఆయన ఏ మాత్రం ఒప్పుకోలేదు. "ప్రజల కొరకు జైల్లో ఎంత కాలమైనా ఉండి పోరాటం సాగిస్తాను తప్ప నేను ఏ పరిస్థితుల్లోనైనా రాజీపడేది లేదు" అని ఆయన ఉక్కు క్రమశిక్షణతో ఆదర్శంగా నిలిచిన నాయకుడు. ఆ క్రమంలో ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో ఆయనను విడుదల చేయాలని ఉద్యమాలు నడిచాయి. ఆ ఉద్యమాల ఫలితంగా తప్పనిసరి పరిస్థితుల్లో ప్రభుత్వం ఆయనను విడుదల చేయడం జరిగింది. ఆయనను విడుదల చేసిన తరువాత – ఆయన ఎక్కడ ఉపన్యాసం ఇచ్చినా, ఎక్కడ మాట్లాడినా ‘‘ దోపిడీ లేని సమ సమాజం రావాలి, పెట్టుబడీదారి వ్యవస్థ నాశనం కావాలి, దేశంలో పుట్టిన ప్రతీ మనిషీ కడుపు నిండా తిండి, వంటి నిండా బట్ట, అందరికీ చదువు, ఉపాధి, ఆరోగ్యం, స్వేచ్ఛ అవన్నీ అనుభవించే పరిస్థితి ఉండాలి’’ అనే వారు. ప్రపంచంలో ప్రతీ మనిషికీ ప్రకృతి నుంచి వచ్చిన సంపదను అనుభవించే పరిస్థితి ఉండాలని చెప్పారు. దోచుకునే వాళ్లు, దోపిడీకి గురయ్యేవాళ్లు, పెత్తందార్లు, పెత్తనాన్ని భరించేవాళ్లు ప్రపంచంలో ఉండకూడదని, అందరికీ సమన్యాయం కల్పించే సమ సమాజం రావాలని ఆయన తన ప్రతీ ప్రసంగంలో కోరుకునేవారు. మార్క్సిజమ్ సిద్ధాంతం రావాలని కోరుకునే మహా నాయకుడు. ఆయన న్యాయవాదే కాకుండా బాక్సింగ్ క్రీడాకారుడు – మంచి బాక్సర్. ఆ రకంగా ఉక్కు మనిషిగా, గొప్ప విప్లవకారుడుగా, ప్రపంచంలోనే అందరికీ ఆదర్శమైన నాయకుడిగా గౌరవాన్ని పొందారు. 27 సంవత్సరాలు జైలు శిక్షను విధించినా ఆయన ఏ మాత్రం చెక్కు చెదరకుండా రాజీపడకుండా ఉన్నారు. ఇవాళ ఒక్క సంవత్సరం పదవి లేకపోతే అనేక మంది అనేక పద్ధతుల్లో వ్యవహరిస్తున్నారు. ఒక్క రోజు జైల్లో ఉన్నా, ఒక్క రోజు పదవిలో లేకున్నా తట్టుకోలేరు. 27 సంవత్సరాలు, దేశం కొరకు, దేశ ప్రజల కొరకు, వివక్షతకు వ్యతిరేకంగా పోరాడిన ఉక్కు మనిషి ఆయన. అలాంటి వాళ్లను మనం ఆదర్శంగా తీసుకోవాలి. కేవలం నివాళులర్పించి మనం సంతాపం తెలియజేయడం మాత్రమే కాదు, అలాంటి మహా

నాయకులను ఆదర్శంగా తీసుకుని వాళ్లు చేసిన త్యాగాల్లో మనం కొంతైనా చేద్దామనే స్ఫూర్తితో మనమందరం ఆలోచన చేయవలసిన అవసరం ఉంది. ఎందుకంటే ఆ రకంగా చేయడమనేది ప్రస్తుత సమాజానికి కూడా అవసరం. మనల్ని అనేక సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయి. ప్రాంతీయ అసమానతలు పెరుగుతున్నాయి. వివక్షత కొనసాగుతున్నది. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 66 సంవత్సరాలవుతున్నా అనేక సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. అందువలన మండేలా గారు ఏ ఆలోచన, ఏ ఆశయంతో ఏదైతే చెప్పారో ఆయన యొక్క ఆశయాలు, ఆలోచనల మార్గంలో నడచుకొని ఈ సమాజంలో మార్పు తీసుకుని వస్తే అందరికీ న్యాయం కలిగే సమ సమాజం రావడానికి అవకాశం ఉంటుంది. అందుకొరకు మండేలా గారికి కేవలం నివాళి అర్పించడం వరకే కాకుండా అలాంటి మహా నాయకుణ్ణి ఆదర్శంగా తీసుకుని ఆయన మార్గంలో నడిచేందుకు ప్రతీ ఒక్కరం ముందుకు వెళ్లాలని ఈ సందర్భంగా తెలియచేస్తూ సిపిఎమ్ పార్టీ తరపున తీవ్ర సంతాపాన్ని తెలియచేస్తూ, ఆ దేశ ప్రజలకు ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

డా.జయప్రకాశ్ నారాయణ్ (కూకట్‌పల్లి)ః అధ్యక్షా, 10 వేల సంవత్సరాల మానవ ఇతిహాసంలో పట్టుమని పదిమంది పేర్లు చెప్పవచ్చు - ఎల్లలకు అతీతంగా, కాలం, స్థలం అధిగమించి మానవ జాతి మొత్తాన్ని ప్రభావితం చేసిన వ్యక్తులు, చరిత్ర గమనాన్ని మార్చిన వ్యక్తులు, నిరంతరం మనందరికీ స్ఫూర్తి ప్రదాతలైన వ్యక్తులు - అలాంటి వారి పేర్లు పది చెప్పవచ్చు. వాళ్లల్లో బహుశా ముగ్గురు గత వందేళ్లలో ఉండటం మనందరి అదృష్టం. మన దేశానికే చెందిన, నిజానికి మానవ జాతి మొత్తానికి చెందినటువంటి మహోన్నతులైన బాపు, మార్టిన్ లూథర్ కింగ్ మరియు నెల్సన్ మండేలా. అధ్యక్షా, అలాంటి మహోన్నత వ్యక్తుల మరణం మానవాళికి లోటైనా వారి జీవితం మనందర్నీ శాశ్వతంగా ప్రభావితం చేస్తుంది. ఆయన 95 సంవత్సరాల అసాధారణమైన జీవితం చరిత్రను మార్చింది. మనకు స్ఫూర్తినిచ్చింది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత వర్ణవివక్ష పోరాటం మొత్తానికి సంకేతంగా ఆయన జీవితం నిలిచింది. గత 70 సంవత్సరాల్లో ఇంకా కొనసాగిన తెల్లజాతుల వలస పాలనకు వ్యతిరేక పోరాటం ప్రపంచమంతటా ఎక్కడ జరిగినా దానికి స్ఫూర్తినిచ్చిన త్యాగధనుడు ఆయన. మూర్తీభవించిన మానవ విలువలకు దర్పణం ఆయన. అన్నింటినీ మించి ద్వేష రహిత సమాజం కోసం నిరంతరం పోరాడి ప్రపంచానికి మార్గం చూపిన

మహనీయుడు ఆయన. కేవలం తన జాతి పట్ల మాత్రమే కాకుండా మానవాళి మొత్తం పట్ల అవ్యాజమైన ప్రేమను, వర్ణం, జాతి, దేశం, వర్గం, లింగం, మతం వీటికి అతీతమైన ఆర్తిని, ఆర్ద్రతను నిరంతరం చూపిన మానవతకు నిలువెత్తు దర్పణం ఆయన.

అధ్యక్షా, కొంత కాలం పాటు ఆయన మీద దేశ ద్రోహ నేరం జరిగి ఉరిశిక్ష పడే ప్రమాదంతో 5 సంవత్సరాల పాటు కేసు నడిచింది. అయినా ఆయన ధైర్యంగా ఎదుర్కొన్నారు. మనందరికీ తెలుసు, 27 సంవత్సరాల పాటు దుర్భరమైన జైలు జీవితాన్ని ఆయన గడిపారు. అయినా ఏనాడు మనస్సులో ద్వేషాన్ని ప్రవేశించనీయలేదు. అధికారం వచ్చాక ఆయన Truth and Reconciliation Commission (TRC) అనే పేరుతో ప్రపంచ చరిత్రలోనే మొట్ట మొదటి సారిగా అంతటి వివక్షకు గురై, అంతటి అన్యాయానికి గురైనా కూడా తెల్లజాతి, నల్లజాతి మధ్య సయోధ్య కావాలి లేకపోతే జాతి భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని గుర్తించి ఆ కమీషన్‌ని తన మిత్రుడు డెస్మండ్ టూటు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి ఆ దేశంలో సమన్వయం కోసం, సామరస్యం కోసం పోరాడి సాధించిన మహనీయుడు ఆయన. అధ్యక్షా, నిజమైన నాయకత్వమంటే విభిన్న వర్గాల ప్రయోజనాల మధ్య సమన్వయాన్ని సాధించేది. ఒకరి వేళ్లతో మరొకరి కళ్లు పెరికించేది కాదు. ఆయనకు దక్షిణాఫ్రికాలో గానీ, ఆఫ్రికా ఖండంలో గానీ, ప్రపంచంలో గానీ ఆయనకున్న స్థాయి వల్ల జీవితమంతా అధికార భోగాలతో గడిపగలిగే అవకాశం ఆయనకుంది. ఆయన పదవినే కోరుకుంటే మరణించేదాకా ఆయనే ఉండేవారు. ఆయన పోయాక ఆయన కొడుకో, కూతురో వచ్చి ఉండే వారు. ఆఫ్రికా చరిత్రలో అసాధారణమైన రీతిలో ఒక్కసారి పదవీ కాలం ముగియగానే మళ్లీ నాకు పదవి అక్కర లేదని మొత్తం ఆఫ్రికా ఖండానికి, వర్ధమాన దేశాలకు అద్భుతమైన మార్గం చూపిన వ్యక్తి ఆయన. జీవితమంతా చనిపోయేదాకా అధికారాన్ని అంటి పెట్టుకునే వ్యవస్థలో మనం ఉన్నాం. మళ్లీ ఒకళ్లు పోయాక కొడుకుకో, కూతురుకో కట్టబెట్టాలని జీవితమంతా పోరాడుతున్న వ్యవస్థలో మనం ఉన్నాం. మనలాంటి ప్రజాస్వామ్యాలకు ఆయన జీవితం, ఆయన చర్యలు ఆదర్శం. గత వందేళ్లలో ఒక గాంధీ, ఒక మార్టిన్ లూథర్ కింగ్ వీరికి సమానంగా మండేలా కాగా, అబ్రహం లింకన్ అమెరికాలో అంతర్యుద్ధం తరువాత అమెరికాలో ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య సయోధ్య కోసం కొద్ది కాలం జీవన పోరాటం చేసారు. ఆయన మరణించక పోయి ఉంటే చాలా వేగంగా ఆ దేశంలో రెండు ప్రాంతాల మధ్య సయోధ్య ఉండేదని ప్రపంచమంతా భావిస్తోంది.

ఉ.10.50

ఆయన మరణించిన కారణంగా ఒక తరం కాలం అమెరికా నష్టపోయింది. నెల్సన్ మండేలా గారు గత 15 ఏళ్లుగా చేసిన గొప్ప కృషి వల్ల దక్షిణాఫ్రికాలో పూర్తిగా సామరస్యాన్ని సాధించగలిగారు. ఇవ్వాళ్టి ప్రపంచంలో ఆయనకు ధీటైన మహా వ్యక్తి మరొకరున్నారు. ఈ సందర్భంలో ఈ సభలో ఆమె పేరు కూడా మనం స్మరించుకోవాలి. ఆవిడే ఆంగ్‌సన్ సూకీ. బర్మాకు చెందిన స్వాతంత్ర్య సమరయోధురాలు ఆవిడ. త్యాగంలో గాని, సామరస్యాన్ని సాధించడంలో గానీ మండేలాకు ధీటైన మహిళ ఆమె.

లియో టాల్‌స్టాయ్‌ని గురించి ఆయన బ్రతికున్న కాలంలో ఒక రచయిత ఇలా అన్నాడు. టాల్‌స్టాయ్ బ్రతికున్న కాలంలో మనం కూడా బ్రతికుండటం మన అదృష్టమని అన్నాడు. అలాగే నెల్సన్ మండేలా గారు బ్రతికున్న కాలంలో మనమందరం బ్రతికుండటం కూడా మన అదృష్టం.

2000 సంవత్సరంలో డర్బన్‌లో జరిగిన ఒక అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక సదస్సులో నేను పాల్గొన్నాను. ఆ రోజున నెల్సన్ మండేలా గారు మమ్మల్ని ఉద్దేశించి ప్రసంగించాల్సి ఉంది. ఆ రోజున మేమంతా కూడా ఉప్పొంగిపోయాం. ఆ సమావేశంలో పలు దేశాల ప్రధానమంత్రులున్నారు, అధ్యక్షులున్నారు, ప్రపంచంలోని వివిధ రంగాల్లో లబ్ధప్రతిష్టులైన వారందరూ ఉన్నారు. మేమంతా కూడా నెల్సన్ మండేలా గారు సమావేశానికి వస్తారని తెలిసి చిన్న పిల్లల్లా పులకించిపోయాం. అయితే అనారోగ్యం వల్ల ఆయన రాలేకపోయాడు. ఆయన స్థానంలో తాబో ఎంబీకీ అని ఆ దేశ అధ్యక్షుడు వచ్చారు. నెల్సన్ మండేలా గారంటే ఎల్లలు లేని మానవాళిని కోరుకున్నటువంటి మహనీయుడాయన.

విక్టర్ హ్యూగో 115 ఏళ్ల క్రితం ఒక గొప్ప మాట చెప్పాడు. 20 వ శతాబ్దాన్ని గురించి ఊహిస్తూ ఆయన ఏమన్నాడంటే – “In the 20th Century, War will be dead. Scaffold war will be dead. Will be but one Country, that Country – the whole plannetors, For all with the hope – that hope the whole heaven.” అధ్యక్షా, విక్టర్ హ్యూగో గారు 20 వ శతాబ్దంలో యుద్ధం నశిస్తుందని ఊహించాడు. ఉరి కంబం అంతమౌతుందని

ఆశించాడాయన. మానవాళి మొత్తానికి ఒకే దేశముంటుంది, అది మన భూమంతా కూడా అని అన్నాడాయన. మానవాళి మొత్తానికి ఒకే ఆశ ఉంటుంది అది స్వర్గమని అన్నాడాయన. అధ్యక్షా, ఆ శతాబ్దంలో మనం సాధించలేకపోయినా, ఈ శతాబ్దంలో మనం సాధిస్తామనే విశ్వాసం కలగడానికి కారణం మహనీయుడైన మండేలా జీవితం, బాపూ జీవితం, మార్టిన్ లూథర్ కింగ్ జీవితం. మండేలా జీవితం మనకి, 21 వ శతాబ్దంలో మన బిడ్డలకి ద్వేషరహిత సమాజాన్ని, ఎల్లలులేని మానవాళిని ప్రసాదించడం కోసం స్ఫూర్తినిస్తుందని ఆశిస్తూ మండేలా అద్భుతమైన జీవితం పట్ల, ఆయనిచ్చిన స్ఫూర్తిపట్ల కృతజ్ఞత తెలియజేస్తూ, ఆయన మృతిపట్ల సంతాపాన్ని తెలియజేస్తూ ఆయనకు నివాళిని అర్పిస్తూ నేను సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్ః దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షులు శ్రీ నెల్సన్ మండేలా గారి మృతిపట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని తెలియజేస్తూ శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నది. ఆయన ఆఫ్రికా దేశాల్లోని ప్రజల హక్కులు, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం అలుపెరగని పోరాటంతో శ్వేత జాతీయుల నియంతృత్వ పాలన నుండి తన ప్రజలకు విముక్తిని కల్పించారు. దక్షిణాఫ్రికాలో భిన్నజాతి ప్రజాస్వామ్యం నెలకొల్పిన మహనీయుడు శ్రీ నెల్సన్ మండేలా గారు. మహాత్మా గాంధీ గారి సిద్ధాంతాలు, అహింసా విధానం పట్ల ఆకర్షితుడైన మండేలా, విద్యార్థి దశలోనే వర్ణ వివక్షకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారు. కఠోర పరిశ్రమ, త్యాగం, పోరాటమే నా జీవితం అని, నా జీవితంలో ఆఖరి రోజు వరకు స్వాతంత్ర్యం కోసం పోరాడుతూనే ఉంటానని ప్రకటించిన నెల్సన్ మండేలా గారు తన జీవితంలో ఎన్ని ఆటుపోట్లు ఎదురైనప్పటికీ చెక్కు చెదరకుండా తన మాట నిలబెట్టుకున్నారు. తనతోటి వారితో కలిసి ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ యూత్ లీగ్ స్థాపించారు. 1918 వ సంవత్సరం జూలై, 18 వ తేదీన జన్మించిన నెల్సన్ మండేలా University of Witwatersrand నుండి న్యాయశాస్త్రంలో పట్టాను పొందారు. మే, 10, 1994 నుండి జూన్, 14, 1999 వరకు దక్షిణాఫ్రికా అధ్యక్షునిగా పని చేశారు. సెప్టెంబరు, 3, 1998 నుండి జూన్, 14, 1999 వరకు అలీనోద్యమ నాయకుడిగా పని చేశారు. 1993 లో నోబెల్ శాంతి బహుమతిని, యూఎస్ఏ నుండి ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడం, సోవియట్ యూనియన్ నుండి ఆర్డర్ ఆఫ్ లెనిన్ వంటి పురస్కారాల్ని అందుకున్నారు. భారత ప్రభుత్వం నెల్సన్ మండేలాకు భారత రత్న పురస్కారమిచ్చి గౌరవించింది. ఎయిడ్స్ వ్యాధి నిర్మూలన కోసం ఐక్యరాజ్య సమితితో కలిసి

మండేలా చేసిన కృషి మరువరానిది. 1995 లో 'A Long walk to Freedom' అనే ఆత్మకథని, 'The Struggle is my life', 'Forging a Democratic, Nonracial South Africa ' వంటి రచనలు చేశారు. నెల్సన్ మండేలా గారు డిసెంబరు, 5, 2013 వ తేదీన తన 95 వ ఏట మరణించారు. శ్రీ నెల్సన్ మండేలా గారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ కొద్దిసేపు మౌనం పాటిద్దాం.

(అనంతరం సభ కొద్ది సేపు మౌనం పాటించింది.)

## 2. ఆంధ్రప్రదేశ్ శాసన సభ మాజీ సభ్యుల మృతి పట్ల సంతాపం

మిస్టర్ స్పీకర్ః ''ఆంధ్రప్రదేశ్ మాజీ సభ్యుల మృతిపట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది''.

శ్రీ మజ్జి నారాయణ రావు గారు 1983 వ సంవత్సరంలో సోంపేట నియోజకవర్గం నుండి శాసన సభ్యుడిగా పని చేశారు.

శ్రీ పిన్నమనేని కోటేశ్వర రావు గారు ముదినేపల్లి నియోజకవర్గం నుండి 1978 మరియు 1983 వ సంవత్సరాల్లో తమ నియోజకవర్గానికి శాసన సభ్యునిగా సేవలందించారు.

శ్రీ కె. అంజినా రెడ్డి గారు హిందూపూర్ నియోజకవర్గం నుండి 1967 వ సంవత్సరంలో శాసన సభకు ప్రాతినిధ్యం వహించారు.

శ్రీ సి.హెచ్. విఠల్ రెడ్డి గారు నర్సాపూర్ నియోజకవర్గం నుండి 1962, 1978, 1985, 1989 మరియు 1994వ సంవత్సరాల్లో శాసన సభ్యునిగా సేవలందించారు.

శ్రీమతి పి.జె. అమృతకుమారి గారు పాలకొండ నియోజకవర్గం నుండి 1989 మరియు 1999వ సంవత్సరాల్లో శాసన సభ్యురాలిగా ఎన్నికయ్యారు.

శ్రీ కింజరపు ఎర్రన్నాయుడు గారు హరిశ్చంద్రాపురం నియోజకవర్గం నుండి 1983, 1985, 1989 మరియు 1994 సంవత్సరాల్లో శాసన సభ్యునిగా ఎన్నికై సేవలందించారు.

శ్రీ పైడి మధుసూదన రెడ్డి గారు కామారెడ్డి నియోజకవర్గం నుండి 1967 వ సంవత్సరంలో తమ నియోజకవర్గానికి శాసన సభ్యునిగా సేవలందించారు.

శ్రీ సి.హెచ్.ఎస్.ఆర్.వి.పి.మూర్తి రాజు గారు పెంటపాడు, ఉంగుటూరు మరియు తాడేపల్లిగూడెం నియోజకవర్గాల నుండి 1955, 1962, 1967, 1972 మరియు 1978 సంవత్సరాల్లో శాసన సభ్యునిగా ఎన్నికయ్యారు.

శ్రీ చెన్నూరు అబ్దుల్ రసూల్ గారు కదిరి నియోజకవర్గం నుండి 1985 వ సంవత్సరంలో శాసన సభ్యునిగా ఎన్నికయ్యారు.

శ్రీ నడింపల్లి రామభద్రరాజు గారు అమలాపురం మరియు చెయ్యారు నియోజకవర్గం నుండి 1952, 1955 మరియు 1965 వ సంవత్సరంలో శాసన సభ్యునిగా ఎన్నికయ్యారు.

శ్రీమతి బి. సరోజినీ పుల్లారెడ్డి గారు మలక్‌పేట నియోజకవర్గం నుండి 1967 మరియు 1972 వ సంవత్సరాల్లో శాసన సభ్యురాలిగా ఎన్నికయ్యారు.

శ్రీ డి. నర్సింగరావు గారు సికింద్రాబాదు కంటోన్మెంట్ నియోజకవర్గం నుండి 1989 వ సంవత్సరంలో శాసన సభ్యునిగా ఎన్నికయ్యారు.

శ్రీ ఆర్. కృష్ణ సాగర్ గారు మదనపల్లి నియోజకవర్గం నుండి 1994 వ సంవత్సరంలో శాసన సభ్యునిగా ఎన్నికయ్యారు.

శ్రీ ఏ.జి. కృష్ణ గారు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుండి 1981 మరియు 1983 వ సంవత్సరంలో శాసన సభ్యునిగా ఎన్నికయ్యారు.

శ్రీ ఆర్. భూంరావు గారు బోధన్ నియోజకవర్గం నుండి 1967 వ సంవత్సరంలో శాసన సభ్యునిగా ఎన్నికయ్యారు.

శ్రీ శ్రీపతి రాజేశ్వర్ గారు ముషీరాబాద్ మరియు సనత్ నగర్ నియోజకవర్గాల నుండి 1983, 1985 మరియు 1999 సంవత్సరాల్లో శాసన సభ్యునిగా ఎన్నికయ్యారు.

శ్రీ వి. గోపీనాథ్ గారు ఉరవకొండ నియోజక వర్గం నుండి 1989 వ సంవత్సరంలో శాసన సభ్యునిగా ఎన్నికయ్యారు.

శ్రీ ఎల్. ఆంజనేయులు గారు మహబూబ్‌నగర్ నియోజకవర్గం నుండి 1980 వ సంవత్సరంలో శాసన సభ్యునిగా ఎన్నికయ్యారు.

శ్రీ కోటగిరి విద్యాధరరావు గారు చింతలపూడి నియోజకవర్గం నుండి 1983, 1985, 1989, 1994 మరియు 1999 వ సంవత్సరాల్లో శాసన సభ్యునిగా ఎన్నికయ్యారు.

డా. పి.వి. రంగారావు గారు హన్మకొండ నియోజకవర్గం నుండి 1989 వ సంవత్సరంలో ఎన్నికయ్యారు.

శ్రీ ఉప్పునూతల పురుషోత్తం రెడ్డి గారు రామన్నపేట నియోజకవర్గం నుండి 1999 మరియు 2004 వ సంవత్సరంలో శాసన సభ్యులుగా ఎన్నికయ్యారు.

శ్రీ సి.కె. నారాయణరెడ్డి గారు పీలేరు నియోజకవర్గం నుండి 1962 వ సంవత్సరంలో ఎన్నికయ్యారు.

శ్రీ బషీరుద్దీన్ బాబూ ఖాన్ గారు బోధన్ నియోజకవర్గం నుండి 1985 మరియు 1994 సంవత్సరాల్లో ఎన్నికయ్యారు.

శ్రీ ఆర్. రాజగోపాల్ రెడ్డి గారు లక్కిరెడ్డిపల్లి నియోజకవర్గం నుండి 1967, 1972, 1983, 1985 మరియు 1989వ సంవత్సరాల్లో ఎన్నికయ్యారు.

ఉ.11.00

శ్రీ ఆర్.సాయినాథ్ గౌడ్ గారు గుత్తి నియోజకవర్గం నుండి 1999వ సంవత్సరంలో ఎన్నికయ్యారు.

శ్రీ ఏ.సి.వై.రెడ్డి గారు రాజమండ్రి నియోజకవర్గం నుండి 1989వ సంవత్సరంలో ఎన్నికయ్యారు.

శ్రీ విసారత్ రసూల్‌ఖాన్ గారు ఆసిఫ్‌నగర్ నియోజకవర్గం నుండి 1984 మరియు 1985వ సంవత్సరాల్లో ఎన్నికయ్యారు.

శ్రీ బద్దు చౌహాన్ గారు దేవరకొండ నియోజకవర్గం నుండి 1985, 1989 మరియు 1994 సంవత్సరాల్లో ఎన్నికయ్యారు.

శ్రీ చాడా వాసుదేవరెడ్డి గారు హసాన్‌పర్తి నియోజకవర్గం నుండి 1962వ సంవత్సరంలో ఎన్నికయ్యారు.

కీర్తిశేషులైన ఈ మాజీ శాసనసభ సభ్యులందరూ రాష్ట్ర ప్రగతి కోసం విశేష కృషి చేశారు. తమ తమ నియోజకవర్గాల అభివృద్ధి కోసం గణనీయంగా పాటుపడ్డారు. ప్రజల సమగ్రాభివృద్ధి కోసం వీరు చేసిన సేవలు మరువరానివి.

వీరి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కొద్ది సేపు మౌనం పాటిద్దాం.

(సభ కొద్ది సేపు మౌనం పాటించింది)

MR. SPEAKER: The House is adjourned to meet again tomorrow at 10.00 A.M.

(The House then adjourned at 11.03 A.M to meet again on Friday, the 13th December, 2013 at 10.00 AM.)